# ఆ న వా లు

చంటిపిల్లడిని ఎత్తుకొని, మిగతా అయిదుగురు పిల్లలూ వెంటరా లక్ష్మి బండిదిగింది.

ఆమె ఆగోపురుడు, పుట్టింట్లో పోసుకుని తనింటికి తిరిగివచ్చింది— ఆమె అకస్మాత్తుగా రావడం చూసి భర్త ప్రసాద్ ఆశ్చర్యపోయాడు. తనభార్య ఎంతో వేగిరం వచ్చేసినట్టు అతనికి అనిపించింది. ఏదో అయిష్టత కనిపించింది అతనిలో ఆమెకి.

"ఉత్తరమయినా వ్రాయకుండా ఇలా దిగిపోయావేం?" అని అడిగాడు. మొట్టమొదట అడిగినప్రశ్న అది.

"వచ్చేస్తూంటే వ్రాసేదేమిటి? అయినా నాన్నగారితో చెప్పేను మీకువ్రాయమని. వ్యవధి లేకపోయిందికామోసు!" అని చెప్పింది లక్ష్మి.

"అంత ఉక్కిరిబిక్కిరి ఏమొచ్చింది తాపీగా బయలుదేరలేకపోయినావా?"

"ఏమిటో యిప్పటికే మూడు నాలుగు నెలలయింది. ఎన్నాళ్ళని వాళ్ళింట్లో పిల్లలతోసహా తింటూ కూర్చోడం? వాళ్ళుమాత్రం లక్షాధికారులా! ప్రతీమారూ వాళ్ళే భరిస్తూ వస్తున్నారాయె!— అయినా కాస్త చేసుకోగలిగే బలం వచ్చాక యింకెందుకు అని వచ్చేశాను?"— అని అంది.

అత డడిగిన ఈ ప్రశ్నలు, వైఖరీ ఆమెకు కొంత

ఆశ్చర్యాన్ని కలిగించేయి. భర్త మరింకేమీ ప్రశ్నించలేదు. బట్టలువేసుకు వెళ్ళిపోయాడు.

ఆడదిలేని కొంప ఎలావుండాలో అలాగేవుంది. ఎక్కడి వక్కడ బూజులుపట్టేసి అంతా అపరిశుభ్రంగా వుంది. తాపీగా ఇల్లుసర్దడం మొదలెట్టింది లక్ష్మి. ప్రపంచంలో ఆడ వాళ్ళే లేకపోతే పరిశుభ్రం అన్నది మచ్చుకయినా వుండ దేమో ? చేసేవాళ్ళుంటేమాత్రం మగవాళ్ళకి శుభ్రత కావాలి— స్త్రీ దగ్గరుండి చూస్తూంటే 'అదల్లాచేశావు, యిదిల్లా చెయ్యాలి, అని చెప్పగలరుకూడ. కాని స్వయంగా చెయ్యవలసివస్తే మాత్రం తెలుస్తుంది అసలువిషయం!

గదిఅంతా గజిబిజిగా, చిందరవందరగా వుంది. ఎక్కడ వుండవలసిన వస్తువు అక్కడలేదు. పందిరిమంచం పందిరినిండా ఏవేవో చొక్కాలూ, పంచలూ, లుంగీలూ, తువ్వాళ్ళూ యిలాటివి వేళ్ళాడుతూ— పాతాళభైరవిలా వుంది! బీరువా అద్దాలమీద అంగుళం దళసరి ధూళి పట్టి వుంది. బీరువా నెత్తిమీద న్యూస్ పేపర్లూ, పత్రికలూ, పుస్తకాలు తాటాకుల్లా అసహ్యంగా వున్నాయి. పెట్టెలు నోళ్ళు సగంవిప్పి లోనుండి బట్టలని కక్కుతూవున్నాయి.

గోడకితగిల్చిన పటాలూ, ఒకటో రెండో, మేకులూడి అడ్డంగా వ్రేలాడుతూ వికారంగా వున్నాయి. ఒకదానికీ ఒక దానికీ వంతెనల్లా సాలిగూళ్ళు అల్లుకొనిపోయాయి. కింద కాలువేస్తే ఆ పాదంతోసహా క్రిందపడిన దుమ్ములంటుకొని అక్కడొక అచ్చుపడుతూంది. అల్లా గదినిండా ఎన్నోపాదాల అచ్చులు కనబడుతూ వున్నాయి.

టేబిలుమీద తనువున్నప్పుడు, కూజాలో పెట్టిన పూల కొమ్మలే వాలి, వాడిపోయి నల్లగా మారిపోయి అసహ్యంగా వున్నాయి. రేజరుసెట్టు విడివిడిగా టేబిలుమీదే పడేసివుంది. దువ్వెనలనిండా చీమలు పట్టివున్నాయి. టేబిల్ క్లాత్ మీద భరిణిలో కుంకం కాబోలు వలికిపోయింది. ఇదంతాచూసి యెక్కడనుండి సర్దడం మొదలెట్టాలో ఆమెకి తోచలేదు. ఇది పడకగది సౌడభ్యం!

ఇక సామానుగది చూస్తే ఒకదానిమీదా మూతల్లేవు. తను జాగ్రత్తగా అన్నిసామానులూ సర్ది వెళ్ళితే మెలుకలు నిరాటంకంగా రాజ్యం యేలినట్టున్నాయి. యాత్రల్లో మనుషుల్లా చీమలు బారులుతీరి ఆహారయాత్ర చేస్తున్నాయి. ఆమెచడి విని మెలుకలు అందినమట్టుకు సంగ్రహించి మకాం యెత్తడానికి జాగ్రత్తపడుతున్నాయి.

ఇదంతాచూసి లక్ష్మి ఆశ్చర్యపోయింది. ఇలా పాడై పోయేకన్నా — పోనీ, పనిమనిషి చిన్నమ్మిచేతనైనా ఒకనాడు దగ్గిరుండి తుడిపించే ఓపిక లేకపోయింది కామోసు — అని విచారించింది.

పందిరిమంచంమీద వ్రేలాడుతున్న బట్టల్నింటినీ తీసి సర్దింది. పక్కమీద దుప్పటి, తలగడా, గలీబులూ ఆ మూడు నెలలనుండీ చాకలి మొహంచూసినట్టు లేవు. నూనెజిడ్డుతో మాసిపోయి వున్నాయి. దుప్పటి ఒకమూలకు ఉమ్మచుట్టుకు పోయివుంది.

ఆ దుప్పటితీసి దులిపేసరికి ఆ మడతలోంచి సిగరెట్టు పెట్టెలూ, అగ్గిపుల్లలూ, కాస్త చిల్లరడబ్బుల్లూ, నాలుగైదు

రకాలూ, రెండుమూడు నోట్లూ జారిపడ్డాయి. వాటితోసహా బరువైన వస్తువు యేదో కిందపడి చప్పుడైంది.

ఏమిటా అని ఆ వస్తువులన్నీ యేరుతూ చూసింది లక్ష్మి. ఆశ్చర్యపోయింది. తనకళ్ళని తనే నమ్మలేకపోయింది. ఒక కాలి వెండిపట్టీ అది! దాన్నిచూసి ఆమెమనసు పరిపరి విధాల పరుగెట్టింది గుండెల్లో రాయిపడింది. కోపం, ఆశ్చర్యం ఈర్ష్య, ఉద్రేకం అన్నీ ఒక్కసారి కలిగాయి! కళ్ళంట నీళ్ళు తిరిగాయి.

ఆ పట్టీ యెవరిదో చూడగానే పోల్చేసింది. అది మరెవరిదోకాదు, తనయింట్లో పనిచేసే చిన్నమ్మిదే!...తనింకా యెంత అమాయకురాలు! పనిమనిషిచేతనైనా తుడిపించలేక పోయారా! అని అనుకుంది, యీ ఇంటినిచూసి. ఇప్పుడు తెలిసింది పనిమనిషి యేంపనిచేస్తూందో? తనుయింట్లో లేని సమయంచూసి. యెంతనాటకం ఆడుతోంది? ఎంతధైర్యం? యెంత సాహసం? అయినా దాన్నిఅని యేంలాభం? ఇటుతన భర్త యింకా చిన్నవాడా?

ఆరుగురుపిల్లల తండ్రి! ఇంకాయేమిటి పాడుబుద్ధి? వయసు మళ్ళిపోతోంది. ఇంకా ఏమిటీకోరిక? ఇంత అన్యాయం చేస్తాడని ఆమె అనుకోలేదు. ఇన్నాళ్ళూ తన జీవితం నిత్యానందమైనదని, తననోముల ఫలంవల్లనే అనుకూలుడైన భర్త దొరికాడని, తన సంసారం ఒక స్వర్గసీమ అని అనుకుంది. తన జీవితం యిలా గడచిపోతే చాలని, చల్లగా చూడమని దేవుళ్ళకు మొక్కుకుంటోంది.

ఇన్నాళ్ళూ ఏగొడవాలేకుండా జరిగిపోయింది. ఇంక

యిప్పుడా యిలాటిబాధలు? నిజంగా తను అనుమానిస్తున్నది వాస్తవమైనదా? తనభర్త అలాటివాడా? ఇంకా అనుమానం దేనికి? లేకపోతే దానికాలిపట్టీ పందిరిమంచంమీదికి యెలా వస్తుంది? తనయింట్లో యెవరికీ అలాంటిపట్టీలు లేవుకదా!— ఇన్నేళ్ళువచ్చి యిప్పుడా అతనికి స్త్రీవాంఛ. అతనికి తనేం లోటుచేసింది? అంతమాత్రం నిగ్రహించుకోలేరా యీామొగ వాళ్ళు?

కోరిక తీరిపోతేచాలని చూస్తారుగాని, దానివల్ల ఎంత పతనమయిపోతున్నారో ఆలోచించరుకదా! శీలాన్ని అంత చులకనగా తీసుకుంటారుగాని మనిషియొక్క విలువ అందులోనే వుందని తెలియదా ?

ఆడది ఏం చేసినా, ఆ రహస్యం దాగకుండా ప్రకృతి శాపం ఇచ్చేస్తుంది! కాని మగవాడేంచేసినా చెల్లుతుంది. కాని శీలం, నీతి అన్నది యిద్దరిలోనూ ఒక్కటే. దాని విలువ స్త్రీ పురుషులకి సమానమే! ఒకదానికి భయపడి శీలాన్ని ఆ విధంగా వుపయోగించుకోవడంలో యింక మానవత్వం ఏముంది? కవిత్వం, చిత్రలేఖనం, సంగీతం వీటిలాగే శీలం. దాన్ని కాపాడుకో గలగడంకూడ భగవంతుడిచ్చిన వరాల్లో ఒకటేమో అని అనిపిస్తుంది— అందుకే అది అందరికీ చేత కాదు, అందరికీ శక్యంకాదు.

ఈ విధంగా ఆమె తలచుకుంటుంటే కోపం లావయి పోతూంది. ఆమె యిదివరకెన్నడూ యిటువంటి సంఘటనని ఎదుర్కొనలేదు. ఇటువంటి అనుమానపిశాచం ఆమెను పట్టుకోనూలేదు. తను అమాయకురాలు, నిర్మలమయినది.

భర్తమీదకూడ అటువంటిభావమే కలది. భర్త తన సొత్తు అని భావించింది. ఆ సొత్తుని యింకొకరు పంచుకుంటున్నా రంటే, సహించలేదు— చిన్నమ్మిగాని ఆ సమయంలో అక్కడవుంటే చంపేయాలన్నంత కోపం ఆమెలో కలిగింది. తన చల్లని సంసారంలో చిచ్చుపడినట్లు ఆమెకళ్ళకు కనిపించింది. తనయిల్లు కూలిపోతున్నట్టు భావించింది. అలా ఎన్నటికీ కాకూడదు. కాకుండా ఆమె ఎదుర్కోవాలి! ఏఅనర్థానికయినా సిద్ధపడాలి! ఇంక యిటువంటి పాపపుపని తనయింట్లో ఎన్నటికీ జరగడానికి వీల్లేదు, జరిగితే సహించి వూరుకోకూడదు!

ఈ సంగతేమిటో పరిస్థితులు ముదిరి విషమించకముందే చక్కబరచుకోవాలి! తన భర్తని అడిగి తేల్చుకోవాలి .అని లక్ష్మి నిశ్చయించుకుంది. నిరుత్సాహంతో ఇల్లంతా ఏదోలా సర్దింది. భర్తవస్తే అడుగుదామని ఎదురుచూస్తోంది.

ఆమెభర్త రానేవచ్చాడు. అనుమానంతో చూస్తున్న ఆమెకంటికి అతనేదో తప్పుచేసి సిగ్గుపడుతున్నవాడిలాగే కనిపించసాగాడు. అతనిలో ఏదో నిరాదరణ ఆమెకి కనబడసాగింది.

అతణ్ణి చూస్తూన్నకొద్దీ, ఆ సంగతేదో తేల్చుకుందామన్న తొందర లావయింది. పిల్లలందరూ అవతలకి ఆడుకుందికి పోనిచ్చి—

"ఏమండీ ఇది చూశారా?" అని మెల్లగా ఆ వెండిపట్టీ చూపెడుతూ అడిగింది.

అతను దానివయిపుచూసి గతుక్కుమన్నాడు. కాని,

"అవును ఎవరిదాపట్టీ!" అని ఏమీ ఎరగనట్టు అడిగాడు.

"ఎవరిదీ? అనే నేనూ అడుగుతున్నాను!" అని నిలదీసింది లక్ష్మి. ఏదోకొంప మునిగిందిఅని ప్రసాద్ అనుకున్నాడు.

"ఏమో నా కేం తెలుసు? నన్నడుగుతున్నా వేం?" అనేశాడు ధైర్యంగా.

"ఈపట్టీ మనింట్లోకి ఎలావచ్చిందా?" అని అడుగుతున్నాను.

"మనింట్లోకా!" అని ఆశ్చర్యం ప్రకటించాడు.

ఆ మనింట్లోకే— మన పందిరిమంచంమీద దొరికింది!— పాపం! ఎవర్తో కాలిపట్టీ జారిపోయిందన్న మాట కూడ మరచిపోయి వెళ్ళిపోయింది. లేక ఆమె లేనప్పుడు జ్ఞాపకార్థం ఆనవాలుగా వుంచుకున్నారా?" అని ఖచ్చితంగా అనేసింది లక్ష్మి.

"ఏమిటి?— ఏమిటి లక్ష్మి ఆ మాటలు!– ఆ పట్టీ సంగతి నాకేమీ తెలీదు!" అని బుకాయించేడు ప్రసాద్.

"మీకు తెలియకపోతే మరెవరికి తెలుస్తుంది? ఎందుకు నాదగ్గర అబద్ధాలు ఆడతారు! అంతగా మీకు యిష్టంలేకపోతే చెప్పరాదూ? మీకంటికి నే నంత కంటకప్రాయంగా వుంటే అక్కడే ఉండిపోదును! ఇన్నేళ్ళు వచ్చి– యిప్పుడింత అన్యాయం చేస్తారని అనుకోలేదు. నన్నిలా ఏడిపిస్తారని అనుకోలేదు!–" అని ఏడుస్తూ కూచుంది.

"ఇప్పు డేం వచ్చింది లక్ష్మి! అలా మొదలెట్టేవు! అనవసరంగా అనుమానపడి నానామాటలూ అంటున్నావంటే!"

“అనుమానం ఏమిటండీ, ప్రత్యక్షంగా కనబతున్న దానికి! పోనీ చెప్పండి! మనయింట్లో లేని వెండిపట్టీ ఎలా మనింట్లోకి వచ్చింది? అందులో మంచంమీద ఎలా జారి పడింది? ఎవర్తెది అది? నా కాపురం పాడుచేయడానికి వచ్చిన దెవర్తె చెప్పండి?” అని కోపంతో అంది.

“ఎవర్తో నాకు తెలీదు.”

“నాకు తెలుసు. మీరు చెప్పనక్కర్లేదు. చూస్తే అంతా బోధపడుతూనేవుంది— అవ్వ?— ఎంత అప్రతిష్ఠ! ఏమండీ! యిప్పుడా మీకీ బుద్ధి! చిన్నపిల్లలా చెప్పడానికి? యిలా నానా వెధవలనీ యింటికి తీసుకువచ్చి— ఇదేం సాని కొంప? ఎంత అమర్యాద? ఎవరికయినా తెలిస్తే ఏమంటారు? ఎంతనవ్వులాట?” అని నీతులుచెప్పబోయింది.

“నోర్మూయ్! ఇంక వాగక— నాయిష్టం!” అని అరిచాడు ప్రసాద్.

“ఎందుకు మూయాలి? మీ యిష్టంవచ్చినట్టు ఆడుతూంటే నాబ్రతు కేం కావాలి? అయ్యో! ఆరుగురుపిల్లలు! వారిముఖమన్నా చూడండి. ఈ కాలంలో యింకా మీకీ వ్యసనం ఏమిటి?”

“మిమ్మల్ని ఏమయినా అంటేకదా! నిన్నిపు డేమన్నా అన్నానా— నేను మడికట్టుకు కూర్చోలేను” అని విచిత్రంగా అన్నాడు.

“అయ్యయ్యో! ఎటువంటి మాట అంటున్నారండి యివాళ! పెళ్లాం పురుటికి వెళ్ళితే ఆమాత్రం ఓర్చుకోలేరా? అందరూ యిలాగే వుంటున్నారా? యింక నీతి, జాతి,

ఏముంది?— మరి చిన్నప్పుడే విధవలయిన ఆడవాళ్ళందరూ ఎలా వుంటున్నారు?"

"అది మీ ఆడవాళ్ళ కర్మ?"

"అలాఅయితే మీరు తిరిగినట్లే నేనుకూడా తిరిగితే వూరుకుంటారా?" అని ఉద్రేకంలో లక్ష్మి అనగానే-

"నోర్ముయ్! ఏమన్నావు" అని ఒక లెంపకాయ కొట్టేడు ప్రసాద్. లక్ష్మి ఏడవలేదు. ఆమెకు పౌరుషం మరీ లావయింది. అంతదెబ్బకీ తమాయించుకుంది.

"అవును, మీరు మగవాళ్ళుకాబట్టి ఏమయినా చేయగలరు! అంతకోపం ఎందుకండి? నా విషయంలో మీ కెలాటి అభిప్రాయంవుందో మీమీదా నాకలాగే వుండకూడదా? మీకొరకు నేను యేమయినా అయిపోవాలి. నామీద అధికారం, హక్కు అంతా మీదేకావాలి. కాని నేను చెప్పినట్లు మీరు వినకూడదూ? మీమీద ఏవిషయం లోనూ నాకు కొంచెంకూడ అధికారం, వుండకూడదూ? మీమీద నా కేహక్కూ లేదు. మీరే అన్యాయంచేసినా ఏమనడానికీ వీలులేదు.

నేను పరపురుషులను తలిస్తేనే మీకు కోపంవచ్చిందే అలాంటిది మీరు నా కళ్లెదుటే- మరొక ఆడదానితో వుంటూవుంటే నా కెలా వుంటుంది? పోనిండి. అయిందేదో అయిపోయింది. ఇకనైనా అలాటిపనులు చేయకండి. నామాట వినండి-మీకాళ్ళు పట్టుకుంటాను. నన్నూ నా పిల్లలను అన్యాయం చేయకండి" అని లక్ష్మి ఏడుస్తూ భర్త కాళ్ళు పట్టుకు బ్రతిమాలింది.

ప్రసాద్ కాళ్ళు విదుల్చుకుంటూ– "లక్ష్మి! ఇదిగో చెప్పేస్తున్నాను. నీకిష్టముందా ఈ యింట్లో మరేగొడవ చేయకండావుండు. నాకు అడ్డురావద్దు. అనవసరంగా చీకాకు కలుపడకు. లేకపోతే..." అని ఖచ్చితంగా అన్నాడు.

"లేకపోతే పొమ్మంటారు అంతేనా? అని పూర్తి చేసింది.

"అవును" అని నిశ్చితంగా చెప్పేశాడు.

"ఎక్కడికి పొమ్మంటారు ? యెక్కడికి పోతాను? మావాళ్ళు యేనాడో మీచేతుల్లో పెట్టారు. ఇంకా వాళ్ళ దగ్గరికి నేనెందుకు వెళతాను? నాయిల్లు నేనువదిలి యెందుకు వెళ్ళాలి? మీ రేలన్నీను! ఇలా నన్ను దుఃఖపెట్టకండి. నామాట వినండి. నన్ను ఉసురుపెట్టకండి."

"భర్తమీద ఉసూరుమనే భార్య ఎందుకు? నువ్వు నా క్షేమం కోరనపుడు యిక్కడెందుకు?"

"ఎంత మాటన్నారు? బ్రతికినా చచ్చినా ఇదే నా ఇల్లు. మీరే నా దైవం. కాని నాకొక్కమాట ఇవ్వండి. మరెప్పుడూ ఇలాంటి పనులు చేయనని చెప్పండి. నా మీద ఒట్టు! అలా అనేవరకూ మీ పాదాలు వదలను" అని లక్ష్మి అతని కాళ్ళు పట్టుకుంది.

ఆమె ఏడుపూ, గొడవా చూచి, ప్రసాద్ ఏమను కున్నాడో ఏమో "సరేలే! ఇంక చీకాకు పెట్టక వదులు" అని కోపంతో గుమ్మందిగి వెళ్ళిపోతున్నాడు.

"భోజనం చేసి వెళ్ళిపొండి" అని బెక్కుతూ అంది లక్ష్మి.

"చాలు. కడుపు నిండి పోయింది" అని కోపంతో వెళ్ళి పోయాడు ప్రసాద్.

ఆ పూట ఆమెకూడా అభోజనం పడుకుంది. ప్రసాద్ రానేలేదు. పిల్లలకి మాత్రం ఇంత పెట్టి, ఇంటిగొడవ వాళ్ళకి తెలియకుండా ఆటలకి పంపి, విచారంతో దుఃఖించసాగింది. ఎలాగయినా అతని దురలవాట్లు మానిపించాలని నిశ్చయించు కుంది.

తను లేకపోబట్టి ఏదో మనసు చలించి ఒకసారి తప్పు చేసి వుండాలి! అంతేగాని, తను దగ్గర ఉన్నట్లయితే అతని మనసు మార్చడం అంత పెద్ద కష్టమయిన పనికాదని సమాధాన పరచుకుంది.

కోపంతో వెళ్ళిన భర్త తిరిగి వస్తాడో, రాడో అని బెంగతో కృంగిపోతూంది లక్ష్మి. ఆ సమయంలో పెరటి తలుపు చప్పుడయింది. వెళ్ళి తీసింది— పని మనిషి చిన్నమ్మి గుమ్మంలో అప్సరసలా తయారయి నుంచొని, అనుకోకుండా తలుపుతీసిన లక్ష్మిని చూసి గతుక్కుమని పోయింది. ఆశ్చర్యం ఏం కనబడకుండా సంబాళించుకుని, నవ్వు తెచ్చుకుని, "ఏమండి అమ్మగారూ! ఎప్పుడొచ్చేశారు? కబురేనా లేకండా" అని పల్కరించింది.

లక్ష్మి అప్పటికేం మాట్లాడలేదు. చిన్నమ్మిని లోపలికి రానిచ్చింది— ఆమె దృష్టి మొట్టమొదట చిన్నమ్మి కాళ్ళమీదికే పోయింది. ఆమె ఎడంకాలి పట్టీలేకపోవడం చూసింది ఆశ్చర్యపోలేదుగానీ, అనుమానం దృఢపరచుకొంది

అది గ్రహించలేని చిన్నమ్మి మామూలుగానే పనులు చేసుకున్నట్లు చేసుకుపోతూంది. లక్ష్మి ముభావం చిన్నమ్మికి కొంచెం వింత కలిగించకపోలేదు. కాని, కారణం బోధపడ లేదు. ఎంతైనా తను పనిమనిషికదా! అంచేత మామూలు గానే కుశలప్రశ్నలు వేసింది. చంటివాపని యెత్తుకుముద్దు లాడింది. అన్నీ నవ్వుతూనే సరదాగానే యెప్పట్లాగనే చేసుకుపోతూంది! యెడంకాలు బోడిగా కనబడితే లక్ష్మి యెక్కడ అడుగుందో అని చీరకుచ్చిళ్ళు పాదాలమీదికి గడి గడికి సర్దుకుంటూంది. లక్ష్మి ఒక కంట కనిపెడుతూనేవుంది.

ఊహించి అనుకుని వచ్చినదొకటీ, వచ్చేక పరిస్థితి ఒకటీ అవడంవల్ల చిన్నమ్మి తబ్బిబ్బుపడక తప్పలేదు. ఇంతకు పూర్వం లక్ష్మి యింట్లోవుండగా తను వచ్చినప్పటివేషం, యిప్పుడు వచ్చినవేషం— ఈభేదమే తనే అనుమానం పడ డానికి కారణమయింది.

ఎప్పుడూ పనులన్నీ అయినాక యిల్లుతుడవడం అల వాటు. అలాటిది యివాళ రాగానే చిన్నమ్మి తుడవడమే మొదలెట్టింది. ఎందుకో ఆమెకే తెలుసు. లక్ష్మి ఆసంగతి ముందే గ్రహించి ఊరుకుంది.

ఇల్లంతా తుడిచి గదితుడిచే చిన్నమ్మి మొదటే గది లోకి వెళ్ళడం ముందే తెలిసిన లక్ష్మి అనుమానాన్ని బలపరిచింది.

చిన్నమ్మి గదితుడుస్తున్నట్టే తుడుస్తూ పందిరిమంచం వైపు వెళ్ళి చూసింది. ప్రక్క శుభ్రంగా పరచిఉండడం చూసి, గుండె దడదడా కొట్టుకుంది. అయినా ఆశకొద్దీ పక్క

మీదా, పరుపుక్రిందా గబగబా వెతక నారంభించింది- లక్ష్మి ఎక్కడవచ్చేస్తుందో అన్న భయంతో గాభరాపడుతూ.

"అక్కడలేదే చిన్నమ్మీ! ఇదిగో నేనుతీసి దాచానులే! ఇంద తీసుకో!" అని వెనకనే నిలబడి లక్ష్మి అంది, ఆ వెండిపట్టీ చేత్తోపట్టుకొని.

వెనక్కి తిరిగి చూసి, చిన్నమ్మి నీరయిపోయి అలాగే నిలబడిపోయింది. గడగడలాడిపోయింది. మొహంఅంతా సిగ్గుతో కందిపోయింది.

"ఊఁ. ఇంద, తీసుకో!" తిరిగి అంది లక్ష్మి.

"చిన్నమ్మి తెప్పరిల్లి" ని...న్న...సిన్న... తుడుస్తున్నపుడు- జారి వుంటుందండీ- ఇంటి కెళ్ళి చూసుకుంటే లేదు. మనిల్లేకదా ఇవాళవచ్చి తీసుకోవచ్చుఅని- మరి రాలేదు" అని ఆపట్టీ అందుకుంటూ అంది.

"తుడుస్తున్నప్పుడు కింద పడుతుంది. మరి పక్క మీద ఎందుకు వెదుకుతున్నావు?" అని ప్రశ్నించింది లక్ష్మి. ఆ ప్రశ్నతో చిన్నమ్మి దెబ్బతిన్నట్లయింది. ఏం జవాబు చెప్పలేక అలా నిలుచుండిపోయింది.

"ఏం మాట్లాడవు?" అని గట్టిగా గద్దిస్తూ అడిగింది లక్ష్మి. చిన్నమ్మి బుజాలు పట్టుకుని ఊపింది కోపంతో.

చిన్నమ్మి ఏడుస్తూ లక్ష్మికాళ్ళు పట్టుకుంది. క్షమించమనీ, తన తప్పేమీ లేదనీ, అతనే తనని బలవంతంచేశాడనీ, డబ్బు కక్కుర్తికి తను లొంగిపోయిందనీ, మరెప్పుడూ అలా చేయననీ వేడుకుంది.

"అందితే జుట్టూ, అందకపోతే కాళ్ళూ పట్టుకుం

టావా? ఛీ! నీకు సిగ్గులేదూ? నీ మొగుడికి మోసం చేసి మరో మగవాడితో కులకడానికి నీ మనస్సెలా వొప్పింది? ఆడవాళ్ళ పరువు నీలాంటివాళ్ళవల్లే పోతూంది.

తిన్నయింటి వాసాలే లెక్కబెడతావా? నా సంసారంలో నీళ్ళు చల్లుతావా? నీలాంటిదాన్ని చేరదీయడం నాదే తప్పు. పో! ఇంక నీ మొహం చూపెట్టకు. మరి నువ్వు నా ఇంట్లో పనికి రానక్కరలేదు. ఇంక, వెళ్ళిపో! మళ్ళీ ఇలాంటి పని చేయకు!" అని చెడామడా చివాట్లు పెట్టింది.

"క్షమించండమ్మా! మరెన్నడూ ఇలా చేయనమ్మా! నన్ను మానిపించేయకండి..." అని చిన్నమ్మి బ్రతిమాలుకుంది గాని, లక్ష్మికి ఆమె నుంచడం మరి యిష్టం లేక, ఆమెచేతిలో ఒక పాతిక రూపాయలు పెట్టి మరి యింటి వయిపు రావద్దని తనభర్తకి కనడవద్దని చెప్పి పంపించివేసింది. అప్పటికి కొంత భారం తగ్గినట్టయింది లక్ష్మికి.

తర్వాత కొన్నాళ్ళవరకూ ప్రశాంతంగానే గడిచింది. అనుమానంతో కూడిన ఆమెమనసుమాత్రం అతని ప్రవర్తనను ఒక కంట కనిపెడుతూనే వుంది. ఇంతకు పూర్వం వినని ఎన్నో విషయాలు ఆ నోటా యీ నోటా ఆమె భర్తపై వింటూంది. కాని ఏం చేయగలదు? అతనంత చెడు వర్తనుడని ఎరుగదు. అసలు యిన్నాళ్ళు తెలియకండా యిలాంటి విషయాలు రహస్యంగా ఎలా దాగి వున్నాయో? అని ఆశ్చర్యపోయింది. కాని యిందులో విశేషం ఏ ముంది? తను అమాయకురాలు. ఇంతకుముందు ఎప్పుడూ తన భర్తపై అలాంటి దురాలోచనలు వెళ్ళలేదు. అతనూ తనలాంటి అమాయకుడే

పవిత్రుడే అని అనుకుంది. ఎప్పుడయినా అనుమానించి ఆ అన్వేషణలోనే వుంటే అతని రహస్య ప్రవర్తన తెలిసివుండే దేమో? ఈ నాటి కది దానంతటదే బయట పడింది.

తన కళ్ళముందరే ప్రసాద్ యిలా ప్రవర్తించడం లక్ష్మికి తల తీసుకున్నట్టుగా వుంది. అది యెంత అవమానం? స్త్రీకి అంతకన్నా హీనత వుంటుందా? తన సంసారానికి గొప్ప ఆపదేదో వస్తున్నట్టు భయపడసాగింది లక్ష్మి. ఏదో మొండి ధైర్యంతో తన భర్తని మంచిదారిలోకి మళ్ళించ లేనా? అనే నమ్మకంతో భగవంతుని నమ్ముకొని గడుపు తూంది.

లోకంలో మరొకరకం మనుషులుకూడా వున్నారు. తమ ప్రత్యక్షంలోనే భర్త యేరీతిగా ప్రవర్తించినా అహం, వ్యక్తిత్వం చంపుకొని, యెన్నిబాధలనైనా భరించి తనను కాదన్నట్టు కుక్కలా పడివుంటారు. కాని ఆ సహనం, ఆఓర్పు తనకిలేదు. ఏదోవిధంగా యెదుర్కొని అటోయిటో తేల్చు కోడమే లక్ష్మి ఉద్దేశ్యం. తన హక్కులో భాగం మరొకరు పంచుకోడం యెంతమాత్రమూ ఆమె సహించలేదు. ఆమనో నిబ్బరంతోనే, ధైర్యంతోనే వుంది.

ఆ నాడు పేరంటానికి వెళ్ళి లక్ష్మి తిరిగి వచ్చేసరికి రాత్రి ఏడూ ఏడున్నర అయిపోయింది. వచ్చేసరికి ఆలస్యం అవుతుందని తెలిసే, మధ్యాహ్నమే వండేసి మరీ బయలుదేరి వెళ్ళింది.

పిల్లలు కాస్త దూరంగా తతిమ్మా పిల్లలతో సహా కలిసి వస్తూండగానే, దీపం ముందుగా వెలిగిద్దామని తొంద

రగా వచ్చింది, లక్ష్మి, యింటికి. యింట్లో దీపం వెలుగు తూండడం చూసి ఆయన యింట్లోనే వున్నారని గ్రహించింది.

వీధి తలుపు తీసేవుంది. ఆమె ఆశ్చర్య పోతూనే లోపలికి వెళ్ళి గదితలుపు తోసింది. ఆ తలుపులూ తీసే వున్నాయేమో బార్లా తెరుచుకున్నాయి.

ఎదురు గుండా కనబడిన దృశ్యం చూసి ఆమె అలా కొయ్యబారిపోయి వుండిపోయింది. ఆమెను చూసి మంచం మీద నుండి ప్రసాద్ ముందూ ఆ వెనక చిన్నమ్మా కంగారుగా కిందికి దిగేరు. చిన్నమ్మి చల్లగా అవతలికి జారుకుంది! ప్రసాద్ లక్ష్మి వచ్చినందుకు కోపంతో కళ్ళంట నిప్పులు కక్కుతూ గబగబా వచ్చి ఆమెని ఒక బాదు బాదేడు.

"నీకు బుద్ధివుందా లేదా? ఎందు కొచ్చావు దెయ్యంలా? పో, యిక్కడనుంచి పో!" అని అమానుషంగా అరిచాడు. ఈ మాటలు వినకముందే లక్ష్మి అతను కొట్టిన దెబ్బకి సొమ్మసిలి పడిపోయింది.

ప్రసాద్ యీ లోకంలో పడ్డాడు ఆమె క్రింద పడే టప్పటికి. కొంచెం భయంతో వణుకుడూ యిన్ని నీళ్ళు ఆమె ముఖంమీద చల్లాడు.

ఆమె తెలివి తెచ్చుకుని "మీరా—?" అంటూ అతని రెండు చేతులూ పట్టుకొని" ఏవండీ ఎందుకిలా నన్ను చంపుతున్నారు. మొన్నటితో మీరు మళ్ళీ అలా చేయరనుకున్నాను— మళ్ళీ యిదేవిటి చెప్పండి——ఇంతేనా? ఇక మానరా? చెప్పండి!" అని అడిగింది.

అతను ఏం మాటాడకుండా చేతులు వెనక్కు లాగు కొని, ముఖం ఆవలకి త్రిప్పుకొని దూరంగా వెళ్లిపోయాడు. లక్ష్మి తనంతట తానే నిలదొక్కుకుని లేచి కూర్చుంది. ఇంతలో పిల్లలు "అమ్మా! ఆకలే!" అంటూ గోలచేస్తూ వచ్చేరు. వారిని వెంటతీసుకు లోపలికి నీరసంగా వెళ్ళిపోయింది.

పిల్లలికి అన్నం పెట్టింది. వారు తింటూండగా భర్త భోజనానికి వస్తాడేమో అని ఎదురు చూసింది గాని, ప్రసాద్ ఒక్కసారి అక్కడకు వచ్చి తీక్ష్ణంగా లక్ష్మివైపు చూసి చరచరా అవతలకి నడిచి వెళ్ళిపోయాడు.

ఆమెకేమీ అర్థంకాలేదు. భర్తతో ఏంమాటాడడానికీ భయం వేసింది. ఇందాకటి సంఘటననుండి ఆమెకు వళ్ళు తెలియని స్థితివచ్చింది. అతను యెందుకలా క్రూరంగా చూసి వెళ్ళినట్లో తెలియదు. తనేం తప్పుచేసిందో అంతకన్నా బోధ పడలేదు.

తప్పుచేసినవాడు తను. మీదుమిక్కిలి ఏమిటీ విచిత్ర ప్రవర్తన! ఇప్పుడెక్కడికి వెళ్ళివుంటాడు? అతని చూపుల్లో ఏదో కసితీర్చుకోవాలన్న భావం, దానివలన తనని ఏడిపించా లన్న ప్రతీకారమూ కనబడుతూ వున్నాయి. ఇంక అతని ప్రవర్తన మాన్పగలగడ మనేది తనకు మించినపని అనుకుంది.

పిల్లలకు చేతులుకడిగి వారిని నిద్రపుచ్చింది. ప్రసాద్ కోసం ఎదురుచూస్తూ, ఎంతకీ రాకపోవడం చూసి అలాగే అక్కడే యెప్పుడో నిద్రపోయింది. విచారంతో ముఖం చిన్న బోయింది. కళ్ళంట నీళ్ళు కారుతూనే వున్నాయి. ఆ ఆవేద

నలో లక్ష్మి యీలోకమే మరచిపోయింది. వీధి తలుపుకూడా వేయడం మరచిపోయింది.

అలా యెంతరాత్రి అయిందో, గదిలో యేదో చప్పుడయ్యేసరికి ఆమె వులికిపడిలేచింది. వంట్లో ఏకోశానా శక్తి వున్నట్టులేదు. అలాగేలేచి యేమిటో చూడడానికి గదివైపు వెళ్ళింది.

ఇంకేముంది! ఆమె నరాలన్నీ తోడుకుపోయినాయి. మళ్ళీ అక్కడ చిన్నమ్మి ప్రత్యక్షం! అంటే, తన భర్త వెళ్ళి మళ్ళీ దీన్ని తీసుకువచ్చే డన్నమాట. లక్ష్మిలో ఒక వైరాగ్యం ప్రవేశించింది. ఈమారు ఎదురుపడ్డానికిగాని, ఎదుర్కొందికిగాని ప్రయత్నం చేయలేదు. అలా ఒక్కక్షణం నిర్జీవప్రతిమాలా అయి పోయి తిరిగి లోపలికి వచ్చేసింది.

కాని ఆమె హృదయం జ్వలించిపోతూంది. శరీరం బగ్గున మండిపోతూంది. అవమానం భరించలేకపోతూంది. ఇంత జరిగినా మళ్ళీ ఆమెను తీసుకురావడంలో తన భర్త ఉద్దేశ్యం ఏమిటి? తన దగ్గర భయంలేదని ఆమెను తన కళ్ళెదుటే యింట్లోవుంచి ఆటలాడుదామనేకదా! ఆవిధంగా తనని యింకా యేడిపిద్దామనేకదా! అబ్బ! యింతకన్నా భార్యకి అవమానం వేరేవుందా? తనకాయింట్లో యింక గౌరవం ఏది, స్థానంఏది? యెందుకు యింకా యీబ్రతుకు?

బ్రతికి యీఅన్యాయాన్ని ఎదుర్కొనగలదు కనకనా? తనకి యేంశక్తివుందికనుక తనకేం స్వతంత్రంవుంది? యింకేం చేయగలదు? ఇంత ధైర్యంగా తన కళ్ళెదుటే మరొకతెను యింట్లోకి తీసుకువచ్చి—అయ్యో! ఆ పవిత్రమైన గదిలో—

ఆమంచంమీద...ఛీ...యింతకన్న అవినీతి యింకేముంది? యింతకన్నా వంచన యింకేముంది? ఇంక సహించలేదు తను. కాని యేంచేయగలదు? అలా వారినిచూస్తూ యేమీ చేయలేక లోలోన కృంగి కృశించవలసిందేనా? ఇంట్లో ఓమూల అన్నిటేసీ దిగమింగుతూ, దాసీలా పడివుండవలసిం దేనా? లేదు. అటువంటి దుర్గతికన్నా చావు మేలు. తన భర్త హృదయంలో, తనయింట్లో తన అధికారాన్ని తుడి చేస్తూ మరొకతె ఆస్థానాన్ని ఆక్రమించేస్తూవుంటే వూరు కొని బ్రతికేకంటె ఆత్మహత్య మేలు. ఈ చేతగానిజీవితం కంటె అదే ఉత్తమం. కాని ...కాని—

పిల్లలు పసిపిల్లలు. వాళ్ళదారి ఏమిటి? వాళ్ళగతి ఏమిటి? యేమిటో అనుకోడంగాని, ఆ భగవంతుడు లేడూ? యీవిధంగా మండిపోతున్న నిప్పులా కణకణ లాడుతున్న ఆలోచనలు ఆమెలో కలిగేయి. భర్త ప్రవర్తన తలచుకొని ఆమె కోపంతో ఒళ్ళు మరచిపోతూంది. పిల్లలని తలచుకొని మాతృప్రేమ పొంగి జాలిగా ఏడుస్తుంది. ఈవిధమైన రెండు సమస్యల్లో ఏమీచేయలేని స్థితిలో చైతన్య హీనురాలై పోయింది లక్ష్మి. అక్కడితో ఆమె ఆలోచనాశక్తి నశిస్తూ వచ్చింది.

ఏదో ఒకశక్తి ఆమెలో ప్రవేశించినట్టయింది. ఆమె యేంచేస్తుందో ఆమెకు తెలియదు. ఆస్థితి పిచ్చా, కోపమా, ఉద్రేకమా? తన కర్తవ్యమేమిటో తెలియనిస్థితి.

ముఖంనిండా పసుపురాసుకుంది. పెద్ద కుంకుమబొట్టు పెట్టుకుంది. పాదాలకు పారాణి రాసుకుంది. ముడిలో పూవులు

ముడుచుకుంది. కొ త్తచీర కట్టుకుంది. ఒకసారి పిల్లలు పరున్న గదిలోకిపోయి వారిని ఒక్కొ క్క రినీ తనవితీరా తడివి ముద్దు లాడింది. చంటి పాపని పొ త్తిళ్ళలోకి తీసుకుంది. హృద యానికి హత్తుకుంది. పాలు చేపుకిరాగా ఆఖరిసారి పాలు యిచ్చి పండుకోబెట్టింది. కంటినీరు తుడుచుకొని గుండెరాయి చేసుకు లేచింది. నడిచింది— వంటింటివైపు.

కిరసనాయిలు తీసింది—

వంటినిండా వంపుకుంది—

అగ్గిపుల్ల అంటించుకుంది—

ఇంకేముంది?

ఇంట్లో పొగలు క్రమ్మడానికి, మంటలు పైకిరావ డానికి ఆట్టేసేపు పట్టలేదు. ప్రేమ కలాపంలోవున్న ప్రసాద్‌కి మంటలనీడలు గదిగోడలమీద కదిలాయి. అక్కడి వేడి, వీళ్ళలోవున్న వేడిని కరిగించివేసింది. ప్రసాదూ, చిన్నమ్మి గదిలోంచి భయంతో వంటింటివయిపు పరుగెట్టేరు.

మంటలు! మంటలు!!— వంటింట్లోంచి ఒక పెద్ద మంటలపోగు బయటకు వచ్చింది, తూలుకుంటూ.

వచ్చి గుమ్మంలో పడిపోయింది.

నిశ్చేష్టుడయిన ప్రసాద్ కళ్ళలో అంధకారం ఆ మంటలలో నీరు కారిపోయింది.

ప్రసాద్ గ్రహించాడు—ఆ మంటలమధ్య తన భార్య లక్ష్మి అని. అతని కేం చేయాలో తోచలేదు. అకస్మా త్తుగా- మరే ఆలోచనా లేకండా ఒక్కటే ఆలోచనతో— అదే— ఒక జీవి ఆపదసమయంలో వుంటే— మరోజీవికి

భగవంతుడు పుట్టించే ఒక సంకల్పం— ఆ ఆలోచనతో గబగబాపోయి లక్ష్మిని రక్షించాలని ప్రయత్నించాడు, ఏ వుపాయం లేకండానే. కాని—

ఆ మహా పతివ్రతని— ఒక కులటను తాకిన పాపపు చేతులతో ఎప్పుడయితే అతను తాకడానికి ప్రయత్నం చేశాడో, అప్పుడే ఆ చేతులు కాలి కొరకంచులయ్యాయి. మొర్రోమంటూ అతనూ అక్కడే కూలబడిపోయినాడు.

ఇదంతా చూసి చిన్నమ్మి భయపడిపోయింది. పోలీసుల గొడవలు బుర్రలోకిరాగా చల్లగా తప్పుకుంది అక్కడ నుండి— తోటి మనుషులు, అసహాయస్థితిలో వుంటే సానుభూతి అయినా ఆమెకు లేదు.

ఆమె నిరాదరణ, విశ్వాసం లేని స్వభావం, ఆమె కఠినహృదయం అర్థంచేసుగున్నాడు— ప్రసాద్. చిన్నమ్మి వెళ్ళిపోతూంటే నిస్సహాయంగా చూస్తూ విస్తుపోయాడు! పిలవనుకూడ లేదు.

క్రిందపడి చల్లారుతూన్న మంటలమధ్యలో, కాలిన వంకాయలా కనబడుతున్న లక్ష్మివయిపు చూడలేక చేతులతో కళ్ళు కప్పుగొనబోయి తన చేతులు పైకి ఎత్తలేక, అలాగే ఏడుస్తూ వుండిపోయాడు.

ఏదయినా ఉపాయంచేసి, ఆ కాస్త లక్ష్మినయినా మసిమైపోకండా దక్కించుకుందామంటే అశక్తుడయి పోయినాడు. తన హీనస్థితికి దుఃఖించాడు. ఇదంతా స్వయంకృతాపరాధం అని పశ్చాత్తాపం పొందాడు.

నలుగురికీ తెలిసిపోయింది. అందరూవచ్చి ఆ దృశ్యం చూసి గుండెలు జారిపోకండా చేతుల్తో అదిమిపట్టుగొని, నిర్విణ్ణులయి చూస్తూ వూరుకున్నారు. మరి కా స్తసేపటిలో పోలీసులు వచ్చేశారు.

ఆ గోలకి లేచిపోయిన పిల్లలు ఏమయిందో తెలియక, ఆ బీభత్సం చూసి భయంతో "అమ్మా! నాన్నా!" అని ఏడుస్తున్నారు. చంటిపిల్ల కారుకారుమని కప్పులెగరేస్తూంది. వారిని దగ్గరకుతీసి ఓదార్చడానికయినా ప్రసాదుకి చేతులు లేకండా పోయినాయి. బాధతో అతను మూలుగుతో కాలి ముద్దయి పడివున్న లక్ష్మికి కొంచెం దూరంలోనే వాలిపోయాడు.

ఇరుగు పొరుగు కొందరు పిల్లలను ఓదారుస్తున్నారు. లక్ష్మి చరమదశలో వుంది. ఏదో సామెత చెప్పినట్టు- ఆమె స్టేటుమెంటుకోసం కాసుక్కూర్చున్నారు. ఏ వైద్యమూ పని చేయదని పెదిమవిరిచి కూర్చున్నాడు డాక్టరు. ఆమెకు కొంచెం స్పృహవుంది. ఆ ఆఖరుదశలో తన భ ర్తకోసమే అన్నట్టుగా ఆమె పెదిమలు కదిల్చింది. ఒక్కసారి కళ్ళువిప్పి చూసింది. ఆ కళ్ళు ప త్తికాయల్లా వున్నాయి- ఎదురుగుండా చేతులకు కట్లతో భ ర్తని, ఏడుస్తున్న పిల్లల్ని చూసింది. మాడిపోయిన ఆమె ముఖంలో ఏం భావాలు కలిగేమో తెలియదు.

ఆ వెంటనే పోలీసులని తక్కిన జనాన్ని చూసింది- కళ్ళు మూసుగుంది, ఏమనుకుందో ఏమో?

"—చీర—అం—టు— గుం— ది— పిల్లలు— జాగ్రత్త—!అని మాత్రం అనగలిగింది. మరి యీ లోకంలో లేదు.

ప్రసాద్ భోరున ఏడ్చాడు. ఆ మొండిచేతులతో యింక ఏ పాపమూ చేయగలడా!—

ఆ పిల్లలూ— కాలిపోయిన మొండిచేతులూ— పందిరిమంచంమీద దొరికిన వెండిపట్టీ— అతనికి ఆనవాలుగా మిగిలిపోయినాయి.